నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 20 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

నాడు ఓ వెలుగు వెలిగిన సంప్రదాయ డిగ్రీ కోర్సులు.. నేడు ఆదరణ లేక వెలవెలబోతున్నాయి. ఒకప్పుడు అడ్మిషన్ల కోసం పోటీపడి ప్రచారం చేసిన కళాశాలలు.. ప్రస్తుతం చడీచప్పుడు లేకుండా పోయాయి. కొన్నేళ్ల క్రితం వరకూ.. డిగ్రీ ప్రవేశాల కోసం 'దోస్త్' నోటిఫికేషన్ వచ్చిందంటే ఏ కళాశాల ఎంపిక చేసుకోవాలోననుకుంటూ విద్యార్థులు ఆరా తీసేవారు. కానీ.. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది. అసలు నోటిఫికేషన్ వచ్చిందనే ఆలోచనలోనే విద్యార్థులు లేకుండా పోయారంటే అతిశయోక్తి కాదు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు వెనుకడుగు వేస్తున్నారు. రీయింబర్స్‌మెంట్ రాకపోవడం, ఫలితంగా నిర్వహణ భారం కావడం వంటి కారణాలతో ప్రైవేటు కళాశాలలు కూడా భారంగా నెట్టుకొస్తున్నాయి. కొన్ని కళాశాలలు మూసివేతకు సిద్ధపడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో డిగ్రీ కాలేజీల పరిస్థితి దయనీయంగా మారింది. రీయింబర్స్‌మెంట్ హామీల అమలు సహా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాల వరకూ ఏ ఒక్కదానినీ పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఇక ప్రవేశాలపై శ్రద్ధను పక్కన పెట్టింది. ఇదిలా ఉంటే.. దోస్త్ మొదటి విడతకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 21తో గడువు ముగియనుంది.

-ఖమ్మం, మే 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- ఆదరణ కరువై సంప్రదాయ డిగ్రీ కోర్సులు వెలవెల
- సీట్లు లభించని స్థితి నుంచి ఖాళీ సీట్ల దుస్థితికి..
- ప్రైవేటు విభాగంలో ఏకంగా మూతబడుతున్న వైనం..
- అడ్మిషన్లలోనూ ఆ కాలేజీల్లో కనిపించని ఉత్సాహం
- రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో నిర్వహణ భారం
- ఖమ్మంలో ఈ ఏడాది మూత దిశగా మరో నాలుగు..
- ప్రైవేటు యాజమాన్యాలు కాలేజీలు బంద్ చేసినా ఫలితం శూన్యం

ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో కోర్సుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

డిగ్రీ డీలా..

వృత్తివిద్యా కోర్సుల క్రేజ్‌తో సరితూగలేక సతమతం

నాడు భళా.. నేడు డీలా..

కొన్నేళ్ల క్రితం వరకూ ఖమ్మం జిల్లాలో డిగ్రీ విద్య అద్భుతంగా సాగింది. ఇంజినీరింగ్ వంటి వృత్తివిద్యా కోర్సులకు క్రేజ్ ఉన్నప్పటికీ డిగ్రీ విద్య ఏమాత్రం మసకబారలేదు. గత ప్రభుత్వం అన్ని కోర్సులకూ ప్రోత్సాహం అందించడంతో డిగ్రీ విద్య స్థిరంగా కొనసాగింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి డిగ్రీ విద్య గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. చివరికి ఇచ్చిన హామీ మేరకు ప్రైవేటు కాలేజీలకు రీయింబర్స్‌మెంట్ కూడా చెల్లించలేదు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా అవి అనూహ్య నిర్ణయాన్ని తీసుకున్నాయి. నిరసన వ్యక్తం చేస్తూ ఏకంగా కళాశాలలను కొన్ని రోజులపాటు మూసివేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాము అధికారంలోకి రాగానే రీయింబర్స్‌మెంట్స్‌ను చెల్లిస్తామంటూ పాలనా పగ్గాలు చేపట్టిన రేవంత్ ప్రభుత్వం.. ఆ హామీని తుంగలో తొక్కింది. 'బకాయిలు చెల్లించి మమ్ములను ఆదుకోండి మహాప్రభో..' అంటూ గడిచిన ఏడాదిన్నరగా మొరపెట్టుకున్నా ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర వీడడం లేదు. దీంతో కళాశాలల యజమానులను నిస్సత్తువ ఆవహించింది. దీంతో బోధనలో అవి నాణ్యతను తగ్గించడంతో విద్యార్థులు అనాసక్తత వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా డిగ్రీ విద్య డోలాయమానంలో పడింది. గత నెలలో జరగాల్సిన పరీక్షలను 'మేం నిర్వహించలేం' అంటూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కరాకండీగా చెప్పాయి. దీంతో దిక్కుతోచక ప్రభుత్వమే పరీక్షలను వాయిదా వేసుకుంది. అలా వాయిదా పడుతూ వచ్చిన పరీక్షలు ఇప్పుడు సాగుతున్న దుస్థితి ఏర్పడింది.

ప్రచారం వైపు కన్నెత్తి చూడని కళాశాలలు..

డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రైవేట్ కళాశాలలు మొన్నటి వరకూ పోటీ పడేవి. ఏకంగా విద్యార్థులకు తాయిలాలు కూడా అందించేవి. కానీ.. ప్రస్తుతం జిల్లాలోని ఏ ప్రైవేట్ కళాశాల కూడా ప్రచారం వైపు కన్నెత్తి చూడడం లేదు. తాయిలాల ఊసే ఎత్తడం లేదు. కొన్ని కళాశాలలైతే.. 'ఉన్నాయో లేవో' అనే పరిస్థితి. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన డిగ్రీ కళాశాలలు ఇప్పుడు డిగ్రీ కోర్సులను మూతవేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒకటి రెండు మినహా మిగిలిన కళాశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్య రెండు అంకెల్లో ఉంటోంది. అధ్యాపకుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. జిల్లాలో ఒకటి, రెండు ప్రభుత్వ కళాశాలల్లో మినహా అత్యధిక కళాశాలల్లో ఎక్కువ శాతం అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం కూడా అతిథి అధ్యాపకులతోనే నెట్టుకొస్తోంది.

రేపటితో మొదటి విడత దోస్త్ గడువు పూర్తి..

దోస్త్ మొదటి విడత ద్వారా డిగ్రీలో చేరేందుకు ఈ నెల 21 చివరి రోజు. ఈ నెల 22 ఆప్షన్స్ ఇవ్వడానికి ఆఖరి రోజు. ఈ నెల 30 నుంచి జూన్ 9 వరకు రెండో విడత ఉన్నప్పటికీ చాలా కళాశాలల్లో మొదటి విడతలోనే ఆయా కళాశాలల్లో ఎంత మంది విద్యార్థులు చేరుతారనేది స్పష్టమవుతుంది. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ అటానమస్ డిగ్రీ కళాశాల మినహా మిగిలిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు రాని పరిస్థితి. ఖమ్మం నగరంలో 11 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుంటే ఈ విద్యాసంవత్సరం నాలుగు కళాశాలలు మూతపడనున్నాయి. కొన్ని కళాశాలలైతే తప్పనిసరి పరిస్థితుల్లోనే కొనసాగిస్తున్నారు.

- ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో గతంలో మొదటి సంవత్సరంలో 500 అడ్మిషన్లు పొందిన కళాశాలల్లో గత సంవత్సరం 150 మంది చేరడం గగనంగా మారిందంటే అతిశయోక్తి లేదు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో మూడు విడతల్లో, స్పెషల్ ఫేజ్‌లో కలిపి చేరిన విద్యార్థుల వివరాలు..

కళాశాల	సీట్ల సంఖ్య	చేరినవారు
ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్	1,500	1,424
నేలకొండపల్లి	300	170
మధిర	300	110
సత్తుపల్లి	480	346
ఖమ్మం ప్రభుత్వ మహిళా కళాశాల	480	242

జల్లేపల్లిలో రైతుల రాస్తారోకో

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్

జల్లేపల్లిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

తిరుమలాయపాలెం, మే 19 : కేంద్రాలకు తరలించిన ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, నాయకులు మాట్లాడుతూ ధాన్యం విక్రయానికి తరలించి నెలలు గడుస్తున్నా నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రాసులుగా పోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో తరుగు పేరుతో క్వింటాకు ఏడు కిలోల చొప్పున కటింగ్‌లు పెడుతూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అయితే ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో చర్చించారు. త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, దాసరి మహేందర్, దడిదల అశోక్, రవి, ఉన్నం శ్రీను, తుళ్లూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వే రెమ్యూనరేషన్ కోసం నిరసన

ప్రజావాణిలో కలెక్టర్‌కు టీఎస్ యూటీఎఫ్ వినతి

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

ఖమ్మం అర్బన్, మే 19 : సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రెమ్యూనరేషన్, ఎస్ఎస్‌సీ స్పాట్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద సోమవారం ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, నాగేశ్వరరావు మాట్లాడుతూ నవంబర్ 2024లో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో నెల రోజుల పాటు ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆరు నెలలు పూర్తయినప్పటికీ రెమ్యూనరేషన్ మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉంచి ఇంతవరకు పైకం చెల్లించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. అలాగే ఆంగ్లం, గణితం ఉపాధ్యాయులకు ఇప్పటివరకు స్పాట్ బకాయిలు విడుదల చేయలేదని వాపోయారు. నిరసన కార్యక్రమం అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, రాంబాబు, నాగేశ్వరరావు, ఉద్దండ్ షరీఫ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్‌ను ముట్టడించిన వలస ఆదివాసీలు

కోయ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్

చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వలస ఆదివాసీలు

చర్ల, మే 19 : ఎన్నో ఏళ్లుగా మండల సరిహద్దుల్లో స్థిర నివాసం ఏర్పర్చుకుని ఉంటున్న తమకు కోయ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చర్ల తహసీల్దార్ కార్యాలయాన్ని వలస ఆదివాసీలు సోమవారం ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వలస ఆదివాసీలు మాట్లాడుతూ తమకు రేషన్ కార్డు, ఓటు హక్కు కల్పించిన ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. కొన్ని వలస ఆదివాసీ గ్రామాల్లోని వారికి కోయ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి, తమకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదివిన పిల్లల ఉద్యోగాల కోసం కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అవసరమని, అవి లేకపోవడంతో నిరుద్యోగులుగా మిగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వలస ఆదివాసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివాసీల ఆందోళనకు బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు.

ఆర్గానిక్ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సమీకృత మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మే 19 : సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన ఆర్గానిక్ పంట ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఎన్ఎస్పీ రోడ్డు వీడియోస్ కాలనీలో ఉన్న సమీకృత మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్‌ను ఆర్గానిక్ ఉత్పత్తుల మార్కెట్‌గా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహజసిద్ధంగా పండించే పండ్లు, బియ్యం, పలు రకాలైన ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని, మార్కెట్‌కు ఆకర్షనీయమైన రంగులు వేయాలని, రైతులకు స్టాల్స్ కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వివిధరకాల సూచనలు చేస్తూ వారం, పదిరోజులలోపు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రసాయనాల వాడకాల ఉత్పత్తుల వలన ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, దళారులు లేకుండా రైతులు నేరుగా అమ్ముకునేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, సరైన వేదిక కోసం ఖమ్మంజిల్లాలో వారం, పదిరోజులలోపు ఆర్గానిక్ ఉత్పత్తులతో హెల్త్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని, రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫీయుల్లా, మార్కెట్ కార్యదర్శి శ్వేత, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం, మే 19 : గిరిజనులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారంపై యూనిట్ అధికారులు దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని వెంటనే పరిష్కరించి.. మిగిలిన వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. పోడు, వ్యక్తిగత, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాల కోసం రుణం, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించుకునేందుకు ఆర్థిక సాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం కోసం ఆర్థిక సాయం తదితర అంశాలపై గిరిజనులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌సీవో గురుకులం అరుణకుమారి, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఎస్‌వో భాస్కరన్, ఏపీవో పవర్ వేణు, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన విషాదం

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అకాల వర్షం
- 22 మూగ జీవాల మృత్యువాత
- స్వల్పంగా ఆస్తి నష్టం
- ఇల్లెందులో పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- ఇల్లెందులో వ్యక్తికి, కారేపల్లిలో దంపతులకు తీవ్రగాయాలు
- చుంచుపల్లి, ములకలపల్లిలో పాక్షికంగా తడిసిన ధాన్యం

చుంచుపల్లి : వర్షం కారణంగా ధాన్యం రాసులపై టార్పాలిన్లు కప్పిన రైతులు

ఇల్లెందు రూరల్/కారేపల్లి/చుంచుపల్లి/ములకల పల్లి/చంద్రుగొండ, మే 19 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం కురిసిన వర్షం విషాదాన్ని మిగిల్చింది. స్వల్పంగా ఆస్తి నష్టం సంభవించింది. ఈ వర్షం కారణంగా పడిన పిడుగుల వల్ల ఇల్లెందులో ఒకరు మృతి చెందారు. కారేపల్లిలో 20 మూగ జీవాలు మృత్యువాతపడ్డాయి. అలాగే, ఇల్లెందులో ఒకరు, కారేపల్లిలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వర్షం, గాలిదుమారం కారణంగా తెగిపడిన విద్యుత్ వైరు తగిలి చంద్రుగొండలో మూడు పశువులు మృతి చెందాయి. ఇక చుంచుపల్లి, ములకలపల్లి మండలాల్లో కురిసిన వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పాక్షికంగా తడిసింది. వర్షం మొదలుకాగానే రైతులందరూ పరుగు పరుగున వెళ్లి ధాన్యం రాసులపై టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమించారు.

పిడుగుపడి వ్యక్తి మృతి

ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన పరిటాల పుల్లయ్య(45) సోమవారం తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న క్రమంలో వర్షం మొదలైంది. దీంతో చెట్టు పక్కన ఆగాడు. ఇంతలో ఆ సమీపంలోనే పిడుగుపడి పుల్లయ్య అక్కడికక్కడే మృతిచెందారు. ఈ భీకర శబ్దానికి.. అతడి పక్కనే ఉన్న అతడి సోదరుడు పరిటాల వెంకన్న సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు గుర్తించి వెంకన్నను ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

22 మూగ జీవాలు మృత్యువాత

కారేపల్లి మండలం పాటిమీదిగుంపు సమీపంలో సోమవారం సాయంత్రం పిడుగుపడింది. దీంతో అక్కడే ఉన్న సుమారు 20 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. బాజుమల్లాయిగూడేనికి చెందిన మద్దెల లక్ష్మయ్య-లక్ష్మి దంపతులు తమ గొర్రెలు, మేకలను మేత కోసం పాటిమీదిగుంపు సమీపంలోకి తోలుకెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తుండడంతో అక్కడే ఉన్న చెట్టు కిందకు జీవాలను తోలారు. వారు కూడా అదే చెట్టు కింద ఉన్నారు. ఈ క్రమంలో ఆ చెట్టుకు అతి సమీపంలో పిడుగు పడింది. దీంతో చెట్టు కింద ఉన్న 17 మేకలు, 4 గొర్రెలు, ఒక పెంపుడు కుక్క మృతిచెందాయి. ఆ పిడుగు ధాటికి మద్దెల లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల పొలాల వారు వచ్చి గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని లక్ష్మి-లక్ష్మయ్య దంపతులను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

తడిసిన ధాన్యం..

చుంచుపల్లి, ములకలపల్లి మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. ఉదయం వేళ కాస్త పొడి వాతావరణం ఉండడంతో రైతులందరూ తమ ధాన్యాన్ని కల్లాల్లోనూ, కొనుగోలు కేంద్రాల్లోనూ ఆరబోశారు. మధ్యాహ్నం తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం మొదలైంది. దీంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. పరుగుపరుగున వెళ్లి ధాన్యపు రాసులపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కొద్దిమేర ధాన్యం తడిసింది. చుంచుపల్లిలో 20 రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే ఉండడం వల్లనే, ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్లనే తమ ధాన్యం తడిసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి

చంద్రుగొండ మండలం గానుగపాడు వాసి యెన్నం వెంకన్నకు చెందిన రెండు పాడి గేదెలు, సత్యనారాయణపురం వాసి భాగ్యరాజుకు చెందిన ఓ దుక్కిటెద్దు ఆదివారం మేతకు వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు మండలంలో గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామ శివారులోని రైల్వేలైన్ పక్కన రైతుల పొలాలకు వెళ్లే విద్యుత్ తీగ కిందపడి ఉంది. గమనించక తగలడంతో ఈ మూడు పశువులూ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. సోమవారం ఉదయం వెతుకుతున్న క్రమంలో చనిపోయిన పశువులను సదరు రైతులు గుర్తించారు.

కారేపల్లి : పిడుగుపాటుతో మృతి చెందిన గొర్రెలు

పిడుగుపడిన చెట్టు

ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను పటిష్టం చేయాలి

- ఆదాయం పెంపు లక్ష్యంగా పనిచేయాలి
- హనుమకొండ డీటీసీ పురుషోత్తం

రవాణా శాఖ కార్యాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీటీసీ

రఘునాథపాలెం, మే19 : జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సేవలను పటిష్టం చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని హనుమకొండ డీటీసీ పీ పురుషోత్తం జిల్లా రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మంజిల్లా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆఫీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీటీవో వెంకటరమణ, ఎంవీఐలతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని పటిష్టం చేసి ప్రతి నెల టార్గెట్‌ను సాధించేలా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచేవిధంగా పని చేయాలని ఆదేశించారు. పన్నులు చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై దృష్టి సారించి బకాయిలను వసూలు చేయడం, వాహన తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. పలు కారణాలతో పట్టుబడి సీజ్ చేయబడిన రవాణాశాఖ ద్వారా వచ్చిన వాహనాలు ఎన్ని ఉన్నాయి.. పోలీస్‌శాఖ ద్వారా పట్టుబడిన వాహనాలు కార్యాలయంలో ఎన్నెన్ని ఉన్నాయో నివేదికను తయారు చేయాలన్నారు. రవాణాశాఖ సీజ్ చేయబడినా విడిపించుకోని వాహనాలను వేలం వేయడం జరుగుతుందని డీటీసీ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి గానూ ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్‌కు వచ్చే క్రమంలో ముందస్తుగా యాజమాన్యాలతో అవగాహన సదస్సు నిర్వహించి సూచనలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడి కార్యాలయంలో వారి సమస్యలపై ఆరా తీశారు. ఏఎంవీఐ స్వర్ణలత, ఇన్‌చార్జి ఏవో సుధాకర్ పాల్గొన్నారు.